# "రచయితల క్లబ్బు"

రచయిత :
నేమాని వీరభద్రరావు

"ఓరే, రామం, యింతవరకు యువకులందరూ ఒక క్లబ్బు, పెద్దలందరూ ఒకక్లబ్బు, స్త్రీలందరు ఒకక్లబ్బు ఆఫీసర్లందరు ఒక క్లబ్బు ఏర్పరచుకున్నారు. మన పట్టణానికి వింతశోభనుగూర్చే క్లబ్బు ఒకటి బయలుదేరింది" అన్నాడు మా వెంకటేశం.

"రిటైర్డు ఆఫీసర్ల క్లబ్బా" అన్నాను.

"అదిపెద్దలక్లబ్బుక్రింద అప్పుడే లెక్కల్లోవేసేసేము"

"మరైతే చెబుదూ చంపక"

"అభ్యుదయ రచయితల క్లబ్బురా"

"యీ సాయంకాలం వెళదాం చూడ్డానికి"

"ఎవరినైనా రానిస్తారా"

"కవి, కవిత్వం అనగానే, వెంటనే కవిత్వాలూకు కవిత్వాన్ని మెచ్చుకొనేవారు ప్రక్కన వుండాలన్నమాటే."

"ఓహో, మరిచిపోయాను. సభ్యులొకరి నొకరు మెచ్చుచుండవలయు" అన్న కోరిక వుంది కదూ!

"ఈవాదనకేంగాని, వారందరూ సమావేశమయ్యే సమయమిది, పద" సరిగ్గా **6-30** గంటలకు చేరుకున్నాము.

ఒకాయన, నిలబడి ఏదో చెప్పబోతున్నాడు: తక్కిన వారిలో కొందరు పేక ఆడుకుంటున్నారు. కొందరు పేపరు చూస్తున్నారు. యిద్దరు ప్రాచీన కవిత్వాన్ని జాయింటు వకాల్తా పుచ్చుకొని తిడుతున్నారు.

నిలుచున్నాయన కాస్త గట్టిగా అరచి "అయ్యా, నేను చాలా మంచి పద్యం వ్రాసుకొచ్చేను. మీరందరు విన తగ్గది" అని అన్నాడు. పేక ఆడుతున్నాయన ముక్కలు ఎత్తి, ఒక్కొక్కదాన్నే నెమ్మదిగా జరిపిచూస్తూ "పో నిద్దురూ, మే మందరం వేలకొలది పుస్తకాలువ్రాసి అచ్చు వేయించే దాత లేక యిలా బూజుపట్టివున్నాం. మీపద్యాలు వినేదెవరు పోనిద్దురూ" అన్నాడు.

"అలా కాదండి, యింగ్లీషులో Sonnet ని అనుకరిస్తూ వ్రాశాను. తప్పక వినాలి" అన్నాడు.

"అందరం వ్రాయగల సమర్థులం గదా! నీ వ్రాత ఎవరిక్కావాలయ్యా" అన్నాడింకో ఆయన.

"అందరం వ్రాయగలవాళ్ళం గనుకనే, మంచి గ్రహించి సరియైన మెప్పు నందజేయగలరనే అభిప్రాయం నాకుంది" అన్నాడా యువకుడు.

ఈబాధ పడలేక, ప్రెశిడెంటుగారు కదిలి "ఆయనంత ప్రాధేయపడుతూంటే మనం విందాం" అన్నాడు.

"అయితే క్లబ్బు రూల్సు తియ్యండి. వాటిప్రకారమే చేదాం, లేకపోతే ప్రతీవాడూ ఏదో వ్రాసుకొచ్చి మన నెత్తిన రుద్దుతానంటే భరించలేం. యింతో అంతో పేరు సంపాదించినవాళ్ళం" అన్నాడొక నవ్యరచయిత.

"తియ్యండి, రూల్సంటేతియ్యండి"అన్నారు ఈ రభసంతా చూస్తూ కూర్చున్నాం నేనూ, మా వెంకటేశమూను.

'రూల్సు' పుస్తకం తీసి చదివేరు.

"ఎవరైనా, తమ రచనను యితరులకు వినిపించ దలుచుకుంటే, పుస్తకం తెరవగానే, రెండు రూపాయిలు మొదట చెల్లించి (వినేవారందరికి అల్పాహారవిందు కుపయోగించేది) చదువుతూన్నంతసేపూ, ప్రతీ పావుగంటకూ ఒక్కొక్క రూపాయి (సిగరెట్లువగైరాలకు వుపయోగించేది) చెల్లించవలెను" అని వుంది.

మన నవకవికి మతిపోయింది. చదవటం విరమించుకుంటాడేమో అని మాకు భయంవేసి, "చదవండీ యీ మాత్రానికి జంకుతారేమిటి. దాని విలువ అదే తెచ్చుకుంటుంది" అన్నాము. ఈ ప్రశంసావాక్యంతో నవకవి సిద్ధపడిపోయాడు కాని వెంటనే మరొకాయన మమ్మల్ని చూసి, "వెళ్ళండీ మీకేమీ తెలియనట్లుంది, రచనలు—రచయితల అవస్థలూను. రాత్రిం బగళ్ళు కష్టపడి కాగితానికి ఒక ప్రక్కనే వ్రాసి, వ్రాసి విసుగెత్తిపోయాను. ప్రశంసావాక్యాలు తప్ప, సురకానీ ముట్టలేదు. మరికొందరివి ప్రచురించనే ప్రచురించరు. ఒకవిధమైన పేరు సంపాదించి నాయన ఏచెత్త వ్రాసినా ప్రచురణ దివ్యంగా జరుగుతుంది. యీ కాలరీతి చూస్తూనే దాని విలువ అదే తెచ్చుకుంటుంది" అని హెచ్చరిస్తూ గద్దమాయించేడు.

"చదవనిద్దురూ, ఈసంగతులు ఎప్పుడూ వున్నవేను" అన్నాం. నవకవి ముందు రెండు రూపాయిలూ ప్రెశిడెంటు గారికి యిచ్చి, చదవటం ప్రారంభించేడు. అందరూ శ్రద్ధగా వింటున్నారు గాని పేకాటదాసులుమాత్రం యీ ప్రపంచంలో లేనట్టున్నారు.

జీవితమనే యెడారిలోన, బయాసిస్సువే ప్రియురాలా!
అపారమగు సంసారముకీవే, సిడ్నీ బ్రిడ్జివే, ప్రియురాలా!
వున్నతభావముల పుట్టినిల్లగు, హిమాలయమవే ప్రియురాలా!
లోతుభావముల కాటపట్టగు పసిఫిక్ ఓషన్ ప్రియురాలా!

అని యింకా చదువుతూంటేనే, "ఆపండీ యింక వినలేం" అన్నాడొక ప్రాచీనకవిత్వం అంటే ఆదరం కలాయన.

"చదవనియ్యండీ, పూర్తిగా వినకుండానే రిమార్కులు వెలిబుచ్చేస్తున్నారు" అన్నాడొక ఆధునికకవి.

నిప్పుమీద విసిరి నీళ్లు చల్లినట్లైంది మన నవకవికి.

"మీరూ, మీరూ తగువులెందుకు, నా స్నేహితు డొకాయన వున్నాడు. ఆయనతో చెప్పి మీగేయం నేను అచ్చు వేయిస్తాను" అన్నారు ప్రెశిడెంటుగారు. ఈమాత్రం ఆదరణ లభించినందుకు నవకవి సంతోషించి "అయ్యా, మీకేనా దయపుట్టినందుకు సంతోషం. జాగ్రఫీమాష్టరు కవిత్వం వ్రాయదల్చుకుంటే ఏపక్కలో నడుస్తుందో వ్రాశాను" అని ఆయన చేతికిచ్చాడు. మరుచటివారమే ప్రెశిడెంటుగారి పేరుతో ఆగీతం పత్రికలో ప్రచురించబడింది. నవకవి పత్రికచూచి నీరైపోయాడు. అడిగి లాభం లేదనుకున్నాడు. "ఆయనికితప్ప మరెవ్వరికి అంత వున్నతభావాలు తట్టవు" అన్నారు క్లబ్బు యువక బృందం.